# కొత్తరోజుల బ్రతుకు

బక్క—ఎద్దు బండిని మెల్లగా లాగుతోంది. బండిలోని బల హీనుడు పగ్గం పట్టుకొని, కళ్లుమూసుకొని పాట పాడుతున్నాడు. అది భగవంతుని గురించినది కాకపోతేనేం, కంఠంలో మాధుర్యం లేకపోతేనేం, వినడానికి హాయిగావుంది. బండి ముందుగా, ఒక బక్క— చిక్కి—న వయసు మళ్ళిన స్త్రీ చేతిలో పాత్ర ఒకటి వుంచు కొని ఇళ్ళ ద్వారాల కేసి చూస్తూ ముందుకు నడుస్తోంది. బండికి కట్టిన ఎద్దు, బండిని లాక్కు—ంటూ ఆమెను అనుసరిస్తోంది.

ఒక ఇంటిముందు అరుగుమీద కూర్చున్న ముసలాయన ఆ బండినీ మనుష్యుల్నీ చూశాడు.

"ఏమమ్మోయ్. ఏవూరు మీది? ఆ బండిలో వున్నా యన నీ కొడుకా?" అన్నాడు.

"మాది దక్షిణాది నాయనా ఆయనకు కండ్లు కనపడవు. కసువుంటే ఒక కట్ట యిప్పించండి. ఎద్దుకు నిన్నటినుంచి మేతలేదు. అల్లాడి పోతోంది" అందామె.

"పలకరించింది తప్పయిందే! సరే." అని తనే లేచి ఇంటిముందే వేసివున్న గడ్డివామిలోంచి ఒక చిన్న కట్టతీసి క్రింద పడేశాడు.

ఆమె ఆ కట్టతీసి వెనకవేపునుంచి బండ్లో వేసి "పోయొస్తాం నాయనా!" అంది.

"ఊ" అని లోపలికి వెళ్ళి పోయాడాయన.

"ధర్మాత్ముడు" అని గొణిగాడు బండిలోని బలహీనుడు. బండి ముందుకు కదిలింది.

ఒక యువతి ఒక పెంకుటింటి ద్వారం దగ్గర నిల్చుని ఆ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తోంది. ఆమె ఆ యువతిని చూసి,

"అంత అన్నం పెట్టమ్మా, ఆకలితో అల్లాడి పోతున్నాం" అంది.

ఆ అమ్మాయి వెంటనే లోపలికివెళ్ళి కొంచెం అన్నం తెచ్చిపెట్టింది. అన్నం పాత్రలో వేయించుకొని –

"నా తల్లి! నా తల్లికి మంచి మొగుడొస్తాడు" అని అమ్మాయిని ఆప్యాయంగా చూసి వెనక్కి తిరిగిందామె. 'పో' అని సిగ్గుతో అమ్మాయి లోపలికి పరుగుతీసింది. మళ్లా రెండు నిమిషాల్లో ద్వారం దగ్గరకు వచ్చి తిన్నగా వెళ్లిపోతున్న బండినే చూడసాగింది.

ఆమె ఒక ఇంటిముందుకువెళ్ళి "అమ్మా" అని పిలిచింది.

"ఎవరది? ఒకటే గోల" అని లోపలినుంచి ఒక స్త్రీ కంఠం పలికింది.

"అంత అన్నం పెట్టండమ్మా" అందామె.

"నోరుముయ్. ఇంకా ఒక ప్రక్క తెల్లారలేదు. అప్పుడే అన్నం అన్నం అని ఈగల్లా ముసురు కొంటున్నారు ఇంటి చుట్టూరా! ముందు మర్యాదగా వెళ్ళిపో. అక్కడే వుంటే, రోకలి తీసుకొచ్చి వడ్డిస్తాను" అనే ఘర్జన విని ఆమె బండి దగ్గరికి నడిచింది.

ఇలా ఆమెకు రోజంతా తిట్లు దీవనలు అందుతూ వుంటాయి. ఆమెకదంతా మామూలే. ఎక్కడో ఒక ప్రత్యేకమైన తెలివైన 'ఆమె' అనే పదునైనమాట కానీ ఆమెకు అట్టే బాధ కలిగించదు.

ఊరంతా తిరిగి పాత్రలో ఒక్క పూటకు సరిపడే అన్నము, కూరా అదీ సేకరించుకొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర కావచ్చి నప్పుడు ఆమె పగ్గం పుచ్చుకొని ముందు నడుస్తూ, ఊరవతల మఱ్ఱిచెట్టు దగ్గరకు నడిపించుకు వెళ్ళింది.

ఎద్దును విప్పి మఱ్ఱిచెట్టు ఊడకు కట్టేసి దాని ముందంత గడ్డిని పడేసింది.

గుడ్డివాణ్ణి బండినుంచి దింపి చెట్టుమొదట కూర్చోబెట్టింది.

మఱ్ఱిచెట్టు దగ్గర్లోనే ఊరంతటికీ "మంచి నీళ్ళు" సరఫరా చేసే పెద్ద చేదబావి వుంది. ఆ వేళప్పుడుకూడా ఒకామె నీళ్ళు చేదుతూ వుంది. ఆమె దగ్గరకు వెళ్ళి ముంతనిండుకూ నీళ్ళు పోయమని అడిగిందామె.

"ఏం దున్నపోతులా వున్నావ్ చేదుకోలేవూ?" అని ఒక క్షణం ఆగి.

"పోన్లే చేదుకొందామనుకొంటే మటుకు తాడూ అదీ వుండొద్దూ. ఔలే. అది నిజమేలే పాపం! ఇంద! ఈ తాడుతో నాకో నాలుగు బిందెలు చేదిపెట్టి నువ్వూ ఓ బిందె చేదుకుపో... పాపం!" అని ఉదారత్వం ప్రకటించింది.

ఆమె చేదుతూవుంటే ఆవిడ గబగబా, ఇంటికి తీసుకు పోతూవుంది. పది బిందెలు చేదిం తర్వాత ఆమె ముంత నిండా నీళ్ళు పోసి —

"ఇంక పోన్లే పాపం. తీసుకుపో" అని తాడు, బిందే తీసుకొని వెళ్లిపోయిందావిడ. "ఎక్కడపోతివే" అని గుడ్డివాడు అరుస్తున్నాడు.

ఆమె నీళ్ళు తేగానే అతడి చేయికడిగి మూకుడులో అన్నం పెట్టింది. తనూ ఓ మూకుట్లో వుంచుకొంది. తిని మూకుళ్లు కడిగి బండిలో భద్రంగా దాచింది.

ఓ అరగంట తర్వాత బండి మళ్లా వూళ్ళోకి బయలుదేరింది.

రాత్రికి మళ్లా మఱ్ఱిచెట్టు ప్రక్కనే వున్న సత్రం ప్రక్కన నిలిచింది బండి.

సత్రం వరండాలో ఆ 'తిండి' తిని, వాళ్లిద్దరూ ఈతచాప మీద బొంత పరుచుకొని పడుకొన్నారు.

చలి రాత్రి. చిక్కని చీకటి. గుడ్డివాడు చేత్తో తడిమి చూసి ఆమె వొళ్ళోకి దొర్లాడు.

"ఊఁ ఊఁ" ... అని మూలుగుతూనే అతణ్ణి దగ్గరగా తీసుకొందామె.

"చలే! ఏం చలే ఈ పూట" అంటూ ఆమెను కౌగిలించుకొని 'వెచ్చదనం' కోసం పెనుగులాడుతున్నాడతడు.

"చలే మరి. చలికాలం వొచ్చేసింది చిన్నీ!" అని అతడి చేతుల్లో ఇమిడిపోతూ – "నా చిన్నీ, నా కోసం నీకు ఇంకా ఎన్ని పాట్లు చిన్నీ" అంటూ ఏంతో "దీన్తో" అతణ్ణి చుట్టుకొని చలి తగ్గించుకొనే ప్రయత్నం చేసిందామె.

దగ్గర్లోనే కుక్కలు వున్నట్లే వుండి బిగ్గరగా ఒకదానివెంట ఒకటి బిగ్గరగా వింతగా అరవసాగేయి.

"నా నుంచి నా చిన్నికి ఎన్ని కష్టాలు" అని మళ్ళా అనుకోసాగిందామె.

ఎవరు ఆమె?

ఏమిటా కష్టాలు పాపం? అతడికీ కష్టాలు రావలసినవి కావు. ఆమెకీ యాతన పడవలసిన గతి పట్టవలసినది కాదు! కానీ "కాకూడదనట్లు" కాలం జరగదు. "మనిషి ప్రయత్నం" కారానిదీ, వీలులేనిదీ కావడానికి దోహదం కలగ జేస్తుంది. వాళ్లిద్దరి విషయంలో అదే జరిగింది.

ఎందుచేతనో చిన్నస్వామిని మొదటిసారి చూసినప్పుడే శేషమ్మలో కదలిక కలిగింది.

అప్పుడు చిన్నస్వామి మాంచి యావనంలో బలంగా బెల్లంకొట్టిన రాయికి మల్లే నిగనిగ లాడుతూ వుండేవాడు. "కొయ్యపని" చేసుకు బ్రతుకుతూ వుండేవాడు. మడకొక్కయ్య చెక్కడం నుంచి ఒకమాదిరి కుర్చీలూ బెంచీలూ చేయడం వరకు అప్పుడే తర్ఫీదయి పెద్దవాళ్ళ గుర్తింపుకోసం ప్రయత్నం చేస్తున్నాడు. అటువంటప్పుడే ఒకసారి శేషమ్మ ఇంట్లో కఱ్ఱసామానులు చేసే అవకాశం కలిగింది చిన్నస్వామికి.

శేషమ్మ వొంటరి మనిషి. తల్లిదండ్రులకు ఆమె ఒక్కతే కూతురు. ఇల్లరికం వచ్చిన భర్త చాలనాళ్ళ క్రిందటే చనిపోతే ఆమె ఒక్కతే వుంటోంది. ఆమెకు మామిడితోటా, కొంత పొలమూ, ఇల్లూ వున్నాయి. స్వయంగా వ్యవసాయం చేయిస్తూ వచ్చి, కొంత డబ్బు కూడా వెనకేసిందని చెప్పుకొనేవారు.

అప్పటికామె వయస్సు ముప్పైరెండేళ్ళు. పాత మంచం విరిగిపోతే, కొత్తది చేయించాలని "ఇబ్బిడి" కొయ్య తెప్పించి,

చేసేందుకని చిన్నస్వామిని పిలిపించింది.

పనిముట్లు తెచ్చుకొని, ఇంటి పెరటివేపు వసారాలో పని ప్రారంభించాడు చిన్నస్వామి.

అతడు పని చేస్తోంటే శేషమ్మ వచ్చి ఎంతసేపూ... "ఇదెట్లా అదెట్లా? దాన్ని అట్లాచెక్కుతావేం" అంటూ మాట్లాడుతూవుండేది. చిన్ని వినీ విననట్లు, ఏదో చెప్తూ పని చేయసాగేడు. మొదటి రోజు అలా గడిచింది.

రెండోరోజు ఉదయం అతడు పని చేసుకొంటున్నాడు. శేషమ్మ స్నానాల గదిలో స్నానంచేసి వసారామునుంచే ఇంట్లోకి వెళ్తోంది! వెళ్తూ గొంత సవరించుకోగానే చిన్నస్వామి తలెత్తి చూశాడు. వొంటికి పలుచనిచీర చుట్టుకొని వెళ్తోందామె. ఎంత వయస్సులో వుంటే నేమి...ఆరోగ్యకరమైన శరీరం. ఆకర్షణీయమైన మెరిసే వొంటిచాయ, అతని కళ్ళను గిర్రుమనిపించాయి. మెడమీదికి తీసుకొన్న కొంగు జారింది. అతడి కళ్లు జిగేల్మ మెరిశాయి.

శేషమ్మ లోపలికి వెళ్లిపోయింది. ఉద్రేకంతో ముందుకు ఒక అడుగువేసి, మళ్ళీ భయమేసి ఠక్కుమని ఆగిపోయాడు చిన్ని. ఉలితో చెక్కుతున్నాడన్న మాటేగాని మనసు మనసులో లేక పనంతా చెడిపో సాగింది. ఆమె నాజూగ్గా అలంకరించుకొని వచ్చి దగ్గరే నిల్చుని మాట్లాడ సాగింది.

ఒకసారి అతడిచేతిలో 'త్రోపడ'ను అలాచూసి—

"అరే...ఇది తమాషాగావుందే" అని దానిమీద చేతులుంచింది. ఆమె చేతుల క్రింద అతడి వ్రేళ్లు వొణికాయి.

"ఏదీ" అని దాన్ని తీసుకొని ఇటూ అటూ తిప్పి,

కథా నిలయం
1304
61

"ఈ మిషను బలే తమాషాగా వుందే." అని మళ్లా అతని చేతుల్లో పెట్టింది. చిన్ని వళ్లు పులకరింపుతో యిదవసాగింది.

అతడు పని చేసుకొంటూ ... అప్పుడప్పుడు కళ్లెత్తి చూస్తే ఆమె చూపులు తనవేపే లగ్నమై వుండటాన్ని గమనించి చిన్ని సిగ్గుపడి పోయాడు. "అమ్మగారికి నామీద దయో ఏదో కలిగింది." అనుకొన్నాడు చిన్నస్వామి. ఆమె ఆ మధ్యాహ్నం అతడికి మంచి భోజనం పెట్టింది. అంత రుచికరమైన భోజనాన్ని అతడు జన్మలో అప్పటికి ఎరగడు. పైగా ఆమె దగ్గరేవుండి ఇంక కొంచెం మరికొంచెం అని పెడ్తూవుంటే... అతడు మత్తెక్కి పోయాడు.

ఆ రాత్రి చిన్నస్వామికి ఎన్నడూ రానటువంటి కల వచ్చింది. ఆ కలలో శేషమ్మ తనను ఎంతో దయతో చూస్తుంది. వొళ్లోకి తీసుకొని ముద్దుపెట్టుకొంటుంది. "నీవు నావాడివి. నిన్ను వదలనే వదలను. ఎంత అందంగా వున్నావు నీవు. ఇంకొంచం శుభ్రంగావుంటే నిన్ను మింగేయనా" అని కౌగిలించుకొంటుంది!

ఉదయం లేవగానే చిన్నికి మామూలు ప్రపంచమే కొత్తగా అందంగా కనిపించింది. వొంట్లో అదోవిధంగా వుందని వేణ్ణీళ్లతో స్నానం చేసి పన్లోకి వెళ్తానని అమ్మతో చెప్పాడు.

స్నానంచేసి, ఉన్నవాటిలో కల్లా తెల్లనివి బాగున్నవి బట్టలు తొడుక్కొని, ఎన్నడూలేనిది నున్నగా జుత్తు దువ్వుకొని చద్దన్నం తిని హుషారుగా శేషమ్మ ఇంటికి వెళ్లాడు.

శేషమ్మ సుందరంగా, కొత్తగా ఉత్సాహంగావుంది. వెళ్లగానే—

"అన్నం తినొచ్చావా చిన్నీ" అంది. "తినే వచ్చాను. ఈ దినం పని పూర్తి చేసేయాలి" అన్నాడు చిన్ని.

"ఈ రోజు ఇడ్లీలు చేశాను. రెండు తినిపో" అని వరండాలోకి పిలిచి పళ్లెంనిండా ఇడ్లీలు వుంచి కమ్మని కొబ్బరి పచ్చడివేసి నెయ్యి తెచ్చి ప్రక్కనవుంచే సరికి, చిన్ని చిత్రంగా పళ్లెన్ని చూసి...ఏదో జంకుతో శేషమ్మను చూశాడు. శేషమ్మ పెదవులమధ్య మధురమైన చిరునవ్వుతో తల్లిలాగా దయగా ప్రేమగా చూస్తోంది చిన్నిని. కూర్చుని తలవంచుకొని చిన్ని ఇడ్లీలు తిన సాగేడు.

అప్పటికే తృప్తిగా చద్దన్నం తినివున్న చిన్ని, ఇడ్లీలు ఎక్కువ తినలేక పోయాడు. అన్నీతింటే గాని ఆమె వదల లేదు.

అన్నీ తిని మత్తుగా ఆయాసంతో, వరండాలో వున్న బెంచీమీద కూర్చుండి పోయాడు కొంతసేపు. శేషమ్మ తాంబూలం తెచ్చిపెడ్తే, తాంబూలం వేసుకొని వుషారుగా పని ప్రారంభించాడు.

ఆ మధ్యాహ్నము రాత్రీకూడా అక్కడే భోజనం చేశాడు. రాత్రిభోజనంచేసి, తాంబూలం వేసుకొని మత్తుగా బెంచీమీద కూర్చున్నాడు.

అప్పుడే తనూ భోజనంచేసి వచ్చింది శేషమ్మ.

"చిన్నీ" అని పిలిచేసరికి చిన్ని తలెత్తి చూశాడు.

"రా" అని లోపలికి దారి తీసిందామె.

"ఇక్కడ్లో పనుందిరా" అని మళ్లా లోపలికి పిలిచేసరికి, లేచి మంత్రముగ్ధుడిలా అనుసరించాడు.

పడకగదిలోకి చేరగానే, అక్కడి సువాసనలు అతణ్ణి మరో లోకంలోకి తీసుకొని పోయాయి.

"చిన్నీ" అని ఆమె భుజాలమీద చేతులుంచి మంచం మీదికి లాక్కుంటూ వుంటే, చిన్ని ఈ లోకం మరచిపోయాడు. ఆమె వొళ్లోకూర్చోబెట్టుకొని ముద్దుపెట్టుకొంది. ఆ వెచ్చనిముద్దు అతనికి ఉద్రేకం కలగ జేసింది. యావనపు బలంతో ఆమె మీది కొరిగి కౌగిలించుకొని జీవితంలో మొదటిసారి ముద్దుపెట్టు కొన్నాడు.

మంచం తయారయింది. కొత్తమంచంమీద మనసులు కలుసుకొన్నాయి. మనసుకు వయసు లేదు. కొత్తా పాతాలేదు. పుష్కరకాలం వయసు తేడా వున్న మనసులు కలిసి పోయి కొత్త అనుభవాలు పొంద సాగేయి.

అది పల్లెటూరు. పల్లెటూరులో రహస్యమనే పదార్థం రహస్యంగా కుళ్లిపోయే అవకాశమే వుండదు. సంఘం ఆ పదార్థం మీది గట్టిపెంకు తొలగించి మంచి గాలీవెలుతురూ తగిలేట్లు చేస్తుంది. అప్పుడు 'రహస్యం' లోని రహస్యం కాస్తా స్పష్టంగా చిన్నా పెద్దా అందరికీ సులబంగా తెలిసిపోతుంది.

"శేషమ్మ, చిన్నస్వామి ప్రణయకలాప" మనే రహస్య పదార్థానికి ఆ గతే పట్టింది. అందుకు శేషమ్మ విచారించే అంత బలహీనపు ప్రేమలో లేదు. ఆ విషయం అందరికీ తెలిసినందుకు

బాధ పడనూలేదు. తను పొందుతున్న ఆనందాన్ని చూసి మూర్ఖులు ఈర్ష్యపడుతున్నారని శేషమ్మ నమ్మింది. ఇలాంటి సంకుచితుల మధ్య వుండరాదనుకొంది. తనూ తన చిన్నీ, ఎక్కడికైనావెళ్లి పోయి, కొత్తగా అందంగా ఆనందంగా గడిపి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని నిర్ణయించుకొంది.

ఆస్తినంతా అమ్మేసి, కొంత డబ్బు చిన్ని తల్లికి యిచ్చేసి, చిన్నితో వూరువదలి పెట్టింది. కొన్నాళ్లు నగరాల హోటళ్లలో జల్సాగా గడిపారు.

ఒకసారి ఇద్దరూ బెంగుళూరులో రోడ్డు వెంబడి వెళ్తున్నారు. చిన్నికి మతి ఎప్పుడూ సరీగావుండదు. శేషమ్మ ఎటు చెప్తే అటు నడుస్తూవుంటాడు. ఇద్దరూ మాట్లాడుకొంటూ నడుస్తున్నారు. హఠాత్తుగా వెనకనుంచి ఒక లారీ జోరుగా వచ్చి చిన్ని ప్రక్కన రాసుకొని, దూసుకుపోయింది. చిన్ని ప్రక్కకు పడ్డాడు. కాలు ముడుచుకొని అంటుకుపోయింది. మోకాలు దెబ్బ తిన్నది. వెంటనే చిన్నిని టాక్సీలో హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లిందామె.

హాస్పిటల్‌నుంచి బయటికొచ్చేసరికి చిన్ని కుంటివాడయ్యాడు. ఆమె దగ్గరున్నడబ్బు తగ్గిపోయింది. ఉన్న డబ్బుతో నగరాలలో బ్రతకడం అసాధ్యమని తేలిపోయింది.

ఆనాటి నుంచి ఆ యిద్దరి బ్రతుకుబాట మలుపు తిరిగింది.

బెంగుళూరు నుంచి కొన్ని మైళ్లు వచ్చి ఆంధ్రలో ప్రవేశించారు. ఒక పల్లెలో పాతవొంటెద్దుబండి ఒక దాన్నీ, మంచి ఎద్దునూకొన్నారు. బండిలో ప్రయాణమయ్యారు.

బండి సరాసరి రాయవేలూరు ప్రాంతానికి నడిచింది.

అక్కడి నుంచి 'వేలూరు ఎఱ్ఱ మట్టిని' పల్లెలకు బండిలో తీసుకువెళ్లి అమ్మసాగేరు. ఈ వ్యాపారం కొన్నాళ్లు బాగానే సాగింది. తర్వాత తర్వాత పండుగలప్పుడు తప్పితే, మిగిలిన రోజుల్లో ఎఱ్ఱ మట్టిని కొనేవారు కనిపించడం మానేశారు.

ఇక యిదికాదని కూరగాయల వ్యాపారం మొదలు పెట్టారు. పల్లెలనుంచి కూరగాయలు కొనుక్కొని వెళ్లి చిత్తూరు, వెల్లూరు వంటి వూళ్లలో అమ్మడం ప్రారంభించారు.

ఈ వ్యాపారంలో నష్టం రాలేదు గానీ, వచ్చేలాభం దిన భత్యానికి చాలక, అసలు డబ్బులోకొంత ఖర్చయిపోతూ వచ్చింది.

ఇలాగ ఊరువిడిచి వచ్చేసింతర్వాత పదిహేనేళ్లు గడిపేశారు. చిన్నస్వామికి చూపు తగ్గిపోయింది! కొన్నాళ్ళకు అసలు కళ్లు చూడటం మానేశాయి!

వికలాంగుడైన భర్త(!) తో శేషమ్మ ఎన్ని పాట్లు పడటానికయినా విచారించ లేదు! పైగా అందులో ఆమెఆనందం అనుభవిస్తోంది!

వయసుమళ్లి శక్తి వుడిగిపోయినా వాళ్లిద్దరూ ఒకర్నొకరు విడిచి పోలేదు.

వ్యాపారం చేయలేక బిచ్చమెత్తుకొని బ్రతికే స్థితికి వచ్చినా సరే...వీలయినప్పుడు ఎవరింట్లో అయినా పనీపాట చేస్తూ...అలా గ్రామాలు తిరుగుతూ మామూలు ఉత్సాహంతోటే శేషమ్మ జీవితయాత్ర సాగిస్తోంది. తను చేసిన పనికి శేషమ్మకు పశ్చాత్తాపం కలగనేలేదు.

కోడికూసింది. చిన్నిని వొళ్ళోనుంచి లేపి కూర్చోబెట్టి బండ్లోనుంచి సన్ననితాడు, చిన్నకుండా తీసుకెళ్లి నీళ్లుచేది తెచ్చింది. ఇద్దరూ మొహాలు కడుక్కొని బండి కట్టారు. ఊరు దాటి మరో వూరుకు ప్రయాణమయ్యారు.

కొత్తవూరు సమీపిస్తోంది. తూర్పునుంచి వెలుగు ప్రసరిస్తోంది! పాతబ్రతుకులో కూడా కొత్తరోజు కొత్తగానేవుంది!

"అక్కడే అలాగే వుండివుంటే, స్తబ్ధుగా ఇప్పటికీ అలాగే నావంట నేను వండుకొని నేనే తింటూ నిస్సారమైన బ్రతుకు గడిపేదాన్ని!

ఈ బాధల్లో కొత్త దనముంది! నాకిక్కడ ప్రతిరోజూ తెల్లవారుతుంది! మార్పూ శాంతీ రెండూవున్నాయి!" అనుకొని ఎద్దును అదిలించింది శేషమ్మ.

బండి కొత్తవూరు చేరుకొంది.